క్లుప్తంగా

అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

కొత్తూరు: పాఠశాలల్లో ఇప్పటివరకు కొనసాగిన ఎస్‌ఎంసీ కమిటీలను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు హెచ్‌ఎం అంగోర్‌నాయక్ అవగాహన కల్పించారు. కమిటీ చైర్మన్‌గా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, కన్వీనర్‌గా పాఠశాల హెచ్‌ఎంను ప్రభుత్వం నిర్ణయిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసినట్లు తెలిపారు. కమిటీల ఏర్పాటు పూర్తి కాగానే పాఠశాలల్లో బాలికల టాయిలెట్లు, తాగునీరు, ఇతర మరమ్మతులను చేపట్టే పనులను చేస్తారని వివరించారు. అంతే కాకుండా కమిటీ సభ్యులు పాఠశాలల బలోపేతంతో పాటు డ్రాపౌట్స్‌ను నివారించడానికి కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలల బాధ్యత కమిటీలదే

కొందుర్గు: ఇక నుంచి పాఠశాలల బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలదేనని ఎంఈఓ కిష్టారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలే చూసుకోవాల్సి ఉంటుందని ఆయన వివరించారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ సిద్ధం చేయించే బాధ్యత ఈ కమిటీలే చూసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం నర్సింహ, ఏపీఎం జయ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కొందుర్గు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని డీపీఎం నర్సింహ సూచించారు. బుధవారం కొందుర్గు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కుతో దేశ భవిష్యత్ మారుతుందన్నారు. ఓటును వినియోగించుకోవడంలో ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జయ, వివిధ గ్రామాల మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని పెంపొందించుకోవాలి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పరిగిరోడ్డులో ఉన్న పోచమ్మ దేవాలయం వద్ద న్యూసిటీ కాలనీ వాసి శ్రీనివాస్‌చారి ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం కాలనీకి చెందిన రమేశ్‌సింగ్ తులసి దంపతులు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు బైండ్ల నర్సింలు టీస్టాల్ ఏర్పాటుకు మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి రూ.10వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత స్వయం ఉపాధి మార్గాలు అన్వేషించి పది మందికి తామే ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో యాదగిరాచార్యులు, మాజీ గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో గ్రామ మాజీ సర్పంచ్ వంకాయల రాంరెడ్డి తన తల్లి కౌసల్యాదేవి జ్ఞాపకార్థంగా బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో మండల కేంద్రానికి పలు గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, కార్మికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవికుమార్, బుర్రి కృష్ణారెడ్డి, నేరేళ్ల యాదిరెడ్డి, దినేశ్, శేఖర్‌గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు జలకళ.. నేడు వెలవెల



నీళ్లు లేక వెలవెలబోతున్న సురంగల్ పెద్దచెరువు



నక్కలపల్లిలోని అక్కమ్మ చెరువులో అడుగంటిన నీళ్లు

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండుతున్న చెరువులు, కుంటలు, వాగులు
- ఆందోళనలో రైతులు

మొయినాబాద్: భానుడు భగ భగ మండిపోతున్నాడు. రోజురోజుకు ఎండలు మరింత పెరుగుతుండడంతో చెరువులు, కుంటల్లో నీళ్లు పూర్తిగా అడుగంటిపోయాయి. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే కరువుఛాయలు కమ్ముకొస్తున్నట్లు కనిపిస్తోంది. గత మూడేళ్లుగా నిండుకుండల్లా ఉన్న చెరువులు, కుంటలన్నీ ఇప్పుడు వెలవెలబోయి కనిపిస్తున్నాయి. మొయినాబాద్ మండలంలోని అన్ని చెరువులు, కుంటల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మండలంలో మొత్తం 50 చెరువులు, కుంటలు ఉండగా అన్నింటి పరిస్థితి అలాగే ఉంది. ఎప్పుడూ నిండుకుండలా ఉండే చిలుకూరు పెద్ద చెరువు, బొబ్బిలికుంటల్లో నీళ్లు పూర్తిగా అడుగంటాయి. అజీజ్‌నగర్‌లోని బంగాలికుంట, నాగిరెడ్డిగూడలోని అబ్బుకుంట, ఎనికేపల్లి చెరువులో గ్రామాల్లో నుంచి చేరే మురుగునీళ్లు ఉన్నాయి. పెద్దమంగళారంలోని బిజినికుంట, పెద్ద చెరువులో చుక్కా నీళ్లు లేకుండా పోయాయి. సురంగల్‌లోని పెద్ద చెరువు, నక్కలపల్లిలోని అక్కమ చెరువులో గుంతల్లో మాత్రమే నీళ్లు ఉన్నాయి. కేతిరెడ్డిపల్లిలోని వెంకటమ్మ చెరువు, అమ్డాపూర్‌లోని పటేల్‌కుంట, ముర్తూజగూడలోని సింగారం చెరువు పూర్తిగా ఎండిపోయాయి. మేడిపల్లి, చిన్నమంగళారం చెరువుల్లో చుక్కా నీళ్లు లేవు. గతంలో కొన్ని చెరువుల్లో మిషన్ కాకతీయ ద్వారా పూడికతీత పనులు చేపట్టినా చెరువులు, కుంటల్లో మాత్రం ప్రస్తుతం నీళ్లు లేకుండా పోయాయి.

ఎండుతున్న బోరుబావులు...

భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో బోరుబావులు ఎండిపోతున్నాయి. మండలంలోని నక్కలపల్లి, ఎత్‌బార్‌పల్లి, తోలుకట్ట, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, శ్రీరాంనగర్, అమ్డాపూర్ తదితర గ్రామాల్లో ఇప్పటికే చాలా మంది రైతుల బోరుబావుల్లో నీళ్లు తగ్గాయి. కొన్ని బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో పంటల ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వడ్డెరులను విస్మరించిన ప్రభుత్వం

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ

షాద్‌నగర్: ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, వడ్డెరులను విస్మరించడం సరికాదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో వడ్డెర కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని పొందుపరిచి పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో కూడా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో 16 కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వడ్డెర కులాన్ని మర్చిపోయారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా వడ్డెర కులస్తుల బ్రతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే తమ బ్రతుకులు మారుతాయని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్డెరులు ఎన్నికల సమయంలో ఓట్లు వేసి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్రంలో ఉన్న అందరి ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతు, నరేశ్, యాదయ్య, రాఘవేందర్, నరేశ్, మల్లేశ్, రమేశ్, నరేశ్, శ్రీశైలం, గణేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఏపీడీకి వ్యవసాయ కార్మిక సంఘం నేతల వినతి

షాద్‌నగర్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను అడిషనల్ పీడీ(ఏపీడీ) చరణ్ గౌతమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏపీడీని కలిసి ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల పెరుగుదలకు అనుగుణంగా ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజుకు రూ.800వేతనం ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ వారం కూలీ డబ్బులు వారి ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కూలీలు లింగం, దీప్లా, రవి, వెంకటేశ్, నాన్యనాయక్, తులసి తదితరులు పాల్గొన్నారు.



ఏపీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

చేవెళ్ల: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు ఒక్క పార్లమెంట్ సీటు కూడా కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ అన్నారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ నిరసన కార్యక్రమాల్లో భాగంగా మండల అధ్యక్షుడు బండ్లగూడెం శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ సీట్లలో రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని మండిపడ్డారు. మాదిగలను రాజకీయంగా ఎదగనివ్వకుండా అణిచి వేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నాలుగు శాతం జనాభా కలిగిన రెడ్డి కులానికి ఆరు సీట్లు కేటాయించుకున్న రేవంత్‌రెడ్డి, 12శాతం ఉన్న మాదిగలకు ఎందుకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదో చెప్పాలన్నారు. 50 శాతం ఉన్న బీసీలకు రెండు స్థానాలే కేటాయించి ద్రోహం చేశారని అందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వం కాదన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో మాదిగలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. దీనికి నిరసనగా పదిరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చన్నగల్ల నర్సింలు, జిల్లా కార్యదర్శి బాత్యల శివశంకర్, ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షుడు నాని భానుప్రసాద్, శ్రీకాంత్, మనోజ్, మహేందర్, రాజు, ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జయంత్యుత్సవాలను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14న నిర్వహించే మహనీయుల జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని ఆ కమిటీ కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహా అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అంబేడ్కర్, పూలే జయంతి జనచైతన్య యాత్ర పేరుతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. సమ సమాజ స్థాపనకు జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. దేశాభివృద్ధికి బాబాసాహెబ్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే అందించిన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

రంజాన్ వేడుకలకు సర్వం సిద్ధం



చేవెళ్లలో ఈద్గా వద్ద వేసిన టెంట్లు

చేవెళ్ల: ముస్లింల పవిత్రమైన పండగ రంజాన్ వేడుకలకు మండలంలోని మజీద్, ఈద్గాల వద్ద ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా టెంట్లు వేయించి పరిసరాలను శుభ్రం చేయించారు. మసీదులను అందంగా విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ముస్లింలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

గురుమందిర వార్షికోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే యాదయ్యకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న వెంకటేశం, నిర్వాహకులు

చేవెళ్ల: మండలంలోని గొల్లగూడ గ్రామంలో గల సాందీప అచల ఋషి పరిపూర్ణ గురు మందిరం 25వ వార్షికోత్సవ కార్యక్రమాలు 12, 13 తేదీలలో నిర్వహిస్తున్నట్లు గురు మందిర వ్యవస్థాపకుడు దయానంద నాగుల వెంకటేశం తెలిపారు. బుధవారం గురు మందిర ఆహ్వాన పత్రికలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది గొల్లగూడ గ్రామంలోని గురుమందిరంలో వార్షికోత్సవం సందర్భంగా పూజలు కొనసాగుతాయని చెప్పారు. గురు మందిర వార్షికోత్సవంతో పాటు శ్రీ సచ్చిదానంద సాయనార్యుల 50వ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12వ తేదీన ఉదయం ప్రభాతసేవ, గీతాపారాయణం, భగవద్గీత పారాయణం, నగర సంకీర్తన, అచల గురు జెండా ప్రతిష్ఠ, మహాపూజ, వైజ్ఞానిక వేదాంత సభ ఉంటుందని తెలిపారు. శ్రీ మదచల గురు పీఠ రాజయోగాశ్రమ సేవా సమాఖ్య అనుబంధ పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి

చేవెళ్ల: అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముడిమ్యాల గ్రామంలో బుధవారం ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్ర కరపత్రాలను పీఏసీఎస్ చైర్మన్, గ్రామ నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అసమానతలపై విరోచిత పోరాటం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమసమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముడిమ్యాల మాజీ సర్పంచ్ ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ మాధవరెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ వాజిద్, పీఏసీఎస్ డైరెక్టర్ రాములు, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా కోశాధికారి వినోద్, శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రతాప్‌రెడ్డి, నాయకులు

పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

షాబాద్: సావిత్రిబాయి పూలేను ప్రతి మహిళా ఆదర్శంగా తీసుకొని ఆమె అడుగుజాడల్లో నడవాలని విగ్రహదాతలు కడమంచి మణెమ్మ, నారాయణదాసు సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత, అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీతలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మోడల్ ఉన్నత పాఠశాలలో ఆమె విగ్రహాన్ని ప్రిన్సిపాల్ లావూరి వాచ్యతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయిపూలే సమాజ అభివృద్ధికి చేసిన సేవలు నేటి తరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గూడూర్ శ్రీనివాస్, నాయకులు కడమంచి జంగయ్య, కృష్ణ ముదిరాజ్, దీపికాకరుణాకర్, ఉపాధ్యాయురాలు రబీయబేగం, వెంకటేశ్వర్లు, రాఘవేందర్, జ్యోతి, జైపాల్, దైవాలగూడ కళాబృందం యాదయ్య, చందు, పాండు, బాల్‌రాజ్ తదితరులున్నారు.



పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విగ్రహదాతలు మణెమ్మ, నారాయణదాసు

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతరెడ్డి

మొయినాబాద్ రూరల్: దేశాభివృద్ధి పీఎం మోదీతోనే సాధ్యమని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల బీజేపీ కార్యాలయంలో ఆమె నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీ చేస్తామని మరిచిపోయిందన్నారు. పది సంవత్సరాల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంటులో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శంషాబాద్ మండలం నర్కూడ గ్రామం నుంచి ప్రజా ఆశీర్వాద యాత్ర ప్రారంభించారని ఆ యాత్ర పదో రోజుకు చేరిందన్నారు. ఆశీర్వాద యాత్రలో భాగంగా 200 గ్రామాలకు పైగా పర్యటించారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, నాయకులు రాజుగౌడ్, సత్యం, నవీన్, రమేష్, సదానంద్, నరేందర్, ప్రభాకర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగీతరెడ్డి

మల్లన్న ఆలయంలో పూజలు ప్రారంభం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న స్వామి ఆలయంలో మొదటిరోజు గణపతి పూజతో పూజలు ప్రారంభమయ్యాయి. బుధవారం పూజల్లో భాగంగా వేదపండితులు ఉదయం గణపతి పూజ, గణపతి హోమం, పుణ్యవచనం, దేవత ఆహ్వానం, జలాధివాసం, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. మల్లన్న ఆలయంలో ఈ రోజు నుంచి 17వ తేదీ బుధవారం వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వేదపండితులు తెలిపారు. పూజా కార్యక్రమాలు ఇలా.. 11వ తేదీ సామూహిక హోమాలు, ఫలపుష్ప ధాన్య శయ్యాధివాసం, మహామంగళహారతి, తీర్థప్రసాదం, 12వ తేదీ యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, బలిపూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, బొడ్రాయికి బోనాలు, అన్నదానం, 14వ తేదీ మల్లన్న కల్యాణ మహోత్సవం, అనంతరం బోనాలు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 15వ తేదీ బీరప్ప స్వామి కల్యాణం, బోనాలు, 17వ తేదీ చివరిరోజు బుధవారం స్వామివారి కల్యాణం, భక్తులకు దైవదర్శనం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ దైవ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. కార్యక్రమాలు గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.



హోమం ప్రారంభిస్తున్న వేదపండితులు